
'రాంపా

# నా తాపం తీర్చడం పాపం కాదయ్యా మగడా!

మా ఊరు అమరావతి.

బ్రతికి వుండగానో - చనిపోయాకో మా ఊరందం (ఊరు అంటే పట్టణం అనీ, తొడ అనీ అర్థం వేర్వేరుగా ఉందిలే) చూడాలని కోరని వాళ్ల బహూశా ఎవరూ వుండరేమో! ఉంటే గింటే వాళ్ల మోక్షం కోరే ముముక్షువులే అయ్యుంటారు. మా ఊరధిపతి ఇంద్రుడు (ఇందులోనూ శ్లేష వుంది స్మీ!). ఆయన తన బలం మీదా బలగం మీదా తన వజ్రాయుధం మీదా కంటేకూడా మా మీదే (మళ్లీనా?.. శ్లేష) ఆధారపడి ముల్లోకాలు ఏలుతూ వుంటాడు. ఆయన కొలువులో నాట్యం చేసే వాళ్లం చాలా మందిమి ఉన్నాం. మంద కాదండోయ్! మంద గమనలం. ఆఁ.. (ఇంకా యినాటికీ ఉన్నాం. ఏనాటికీ ఉంటాం. మా వీటికి అందం తెస్తుంటాం సుమా!)

మా పేర్లు మీరూ వినే ఉంటారు. అయినా చెబ్తాను. రంభ.... ఊర్వశి... మేనక... తిలోత్తమ. ఘృతాచి. అదిగో... మీ రప్పుడే ఆశపడ్తున్నారు. అవునా! మీ కళ్లల్లో మెరుపులు, మీ ఒంటిలో విరుపులు, మనస్సులో రెపరెపలు.. అయినా యిక్కడి దాకా రావాలిగా మీరు. ఇప్పుడేం తొందర్లేదు. ఆగండి. అవున్లే! అచ్చెర మచ్చెకంటుల అందాలు - చందాలు (వందం అంటే తీరు అన్నమాట! ఏ తీరు? ఏ తీరున మేం దయతలుస్తామో అదీ! ఆఁ) చవిచూడాలని ఆశపడని నరుడెవ్వడు? ఆ 'నరుడు' (అర్జునుడు) ఒక్కడూ తప్ప.

నేను ఇక్కడ ప్రధాన నర్తకీ మణుల్లో ఓ మణిని నారీమణిని. నా పేరు.. ఎందుకులెండి. నా పేరెందుకు నేను చెప్పుకోవాలి. పేరు చెప్పకనే కాస్సేపాగితే మీరే తెలుసుకుంటారు.

అమృతం తాగి తాగి అమరసుఖాలు అందించి అందించి బాగా అలసి సొలసి పోతే విశ్రాంతిగా విడిది చేసేందుకు ఎంచక్కా యించక్కని చోటు ఒకటుంది? ఎక్కడ అని అడగరేం?

మీ భూలోకంలోనే.. మీరంతా మావూరుపై ఆశపడితే (ఊఁ ఆశ) మేం మీ ఊరు మీద ఆశపడ్తాం. వింతగా విడ్డూరంగా అన్పించిందా! ఏం చేస్తేం! నిజమాడితే



కథా నిలయం
1592
శ్రీకాకుళం

నమ్మరు మరి. మీ లోకం తీరే అంతకదా! మేం మిమ్మల్నీ మీ లోకాన్నీ మీ లోకం అందాల్నీ ఎంతగా యిష్టపడతామో మీకేం తెలుసు? మాకు తెలుసు మా మనసులకు తెలుసు. అయినా ఒకటి చెబ్తా నమ్ముతారు కదూ! మా ఇంద్రుడున్నాడే - ఆయన - ఆయన కంటెదురుగా (కాదు వేయి కళ్లెదురుగా) మేం ఆయన కళ్లు మిరుమిట్లు కొల్పేట్టుగా ఉన్నా - మమ్మల్ని కాదని మీ భూలోక సుందరీ మణులపైన్నే ఆశపడ్తుంటారు. అహల్య సంగత్తెలుసుగా.. ఆరెండు కళ్ళు ఒళ్లంతా కళ్లయ్యేలా చేశాయి... ఔనా?

ఏమన్నాను. మా మనస్సంతా మీ భూలోకం పైన్నే... మీ భూలోకంలో చల్లని వేసవి విడిది.. హిమాలయాలు అవి 'అభంగ తరంగ మృదంగ నిస్వనాలు' సృష్టించే లోయలకీ, ఎంతటి పర్వతాన్నయినా తొండంతో ఆడించే ఏనుగుల గుంపులకీ నిలయాలు. ఈ సానువుల్లోనే సాగరుడు తపస్సు చేశాడు. గంగ నేలకు దిగంగా కొండ అరిగిందీ యిక్కడే! పార్వతి శివుడ్ని కోరి కోరి తపస్సు చేసిందీ యిక్కడే! మన్మధుడు శివుడి కోపాగ్నిలో మంట కలిసిందీ యిక్కడే!

అక్కడే కేదార తీరంలో నేను భవనం కట్టుకున్నాను. ఎప్పుడు మనసైతే అప్పుడు వచ్చి పోతూ వుంటాను. ఈ చల్లదనానికే నా తాపం ఉపశమిస్తూ వుంటుంది. మీ లోకం నీళ్లు తాగి మిసమిసలాడుతూ బుసకొట్టే యవ్వనంతో తిరిగి మా వూరు వెళుతూ వుంటాను.

మా భవనం ఎలా వుంటుంది? అది రత్నాల మేడ. ఆ మేడ - స్త్రీ మెడచుట్టూ నగలు అలంకరించినట్టుగా - చుట్టూ ద్రాక్ష తీగలు పూల తీగలు అల్లి బిల్లిగా అల్లుకున్నాయి అంత అందమైన ఇంట్లో ఆ వేసగిలో బాగా భోంచేసి (మీ అన్నమే - మీ కూరలే - మీ ఊరగాయలే - మీ పచ్చళ్లే - పాయసాలే - మీ పాలు పెరుగు లేస్మీ) మామిళ్లు సేవించి, ఆ మీద తాంబూలం దట్టించాను. ఆ తాంబూలం ఎలాటిది?

మృగమదసౌరభ విభవ
ద్విగుణిత ఘనసార సాంద్ర వీటీ గంధ
స్థగితేతర పరిమళమై
మగువ పాలుపుదెలుపు...... తుంది... అదీ...

కకుర్తి గుప్పుమనేలా పచ్చ కప్పురం రెండింతలై దాని పరిమళాలు రెట్టించేలా ఆ హిమాలయాల్లోని తమలపాకులు జోడించా! ఇక చూసుకోండి.

నా పదస సౌరభం. అల్లంత దూరం అలా అలా గుమగుమలాడ్తూ ముద్దు గుమ్మ పాలుపు తెలుపుతూ అలా గాలి వెంట వెళ్లింది.

తాంబూలం మైకంలో ఒకొంత వొళ్లు మరిచాను. మరిచి అటు చూస్తే ఎవరో బ్రాహ్మణుడు... వస్తున్నాడు ఇటే.. అతడ్ని చూసి చూడగానే అబ్బుర పాటుతోడ నయనాంబుజముల్ వికసించాయి. మదిలో కోరికలు గుబ్బతిల్లాయి. గుబ్బ మెరుంగ శరీరం గగుర్పొడిచింది. కాంతి పెల్లుబ్బి కనీనికల్ వికసితమయ్యాయి. నలకూబర సన్నిభుడు ఆ ధరామరుడ్ని చూశాను.. చూడగానే వాయిస్తోన్న వీణని సేవిస్తోన్న తాంబూలాన్ని ఆపేసి దిగ్భ్రమతో లేచినుంచున్నా! నా కళ్లు యింతింత లయ్యాయా? ఎద పొంగిందా? యిక ఆగలేక కాలి అందెలు ఝళం ఝళలు మ్రోయగా అతని కెదరు నడిచాను.... అతన్ని చేరేకొద్దీ ఒళ్లంతా పులకింత వింతలు.. ఎవడతడు?

ఎక్కడి వాడొ యక్షతనయేందు జయంత వసంత కంతులన్
చక్కదనంబునన్ గెలువ జాలెడు వాడు.....
మహీసురాన్వయం బెక్కడ? ఈ తనువిభవమెక్కడ?

అనుకున్నాను ఆ వింత వింత పులకింతల పుంతలో... అనుకుని ఆగలేక తత్తర పడుతూ- ఎవరో! ఏం సంగతో! ఎందుకొచ్చాడో! కథేంటో! కథనమేంటో! మనసేంటో! మాటేంటో... తెలుసుకుందామని కదిలాను.

నన్నుచూసి విభ్రాంతుడై అతడొచ్చాడు. వచ్చి -
ఎవ్వతె వీవు భీతహరిణేక్షణ! ఒంటి చరించె దోట లే
కివ్వన భూమి.......

ఎవ్వరు నువ్వు? బెదిరే కన్నులు జింక కన్నుల్లా ఉన్నాయి ఈ చోట ఒకత్తివే తిరుగుతున్నావు. భయం లేదా? నేను బ్రాహ్మడ్ని నన్నంతా ప్రవరుడని పిలుస్తార్లే! మా వూరు నుంచి యీ సౌందర్యాలు చూడాలని పొగరుబట్టి వచ్చా... పొగరణిగేలా అయ్యిందిలే.. దారి తప్పా... మళ్లీ మా వూరు వెళ్లాలి త్వరగా... దారి చెప్పి పుణ్యం కట్టుకో.. నీకు శుభం అవుతుంది. ఇది మా దీవన... అన్నాడు.

అతన్ని - అతని తత్తర పాటునీ చూస్తే నవ్వొచ్చింది. నవ్వురాదూ మరి? బాపడ్నంటాడు! నిజమా? నిజమేనా? అప్పుడనిపించినట్టు.. ఎక్కడివాడో.. యక్షకుమారుడు నలకూబరుడు, ఇంద్రుడి కుమారుడు జయంతుడు, విష్ణువు కుమారుడు కంతుడు, అతని. స్నేహితుడు వసంతుడు ఇతడి అందం ముందు

దిగదుడుపే కదూ! భూసురులకు సురులకు లేని అందం ఎలా వచ్చిందబ్బా! ఇంతందగాడ్ని ఓ చూపు చూస్తే యితడూ నన్నో చూపు చూస్తే మన్మధుడు నా కాలిబంటు కాడూ?

అయినా - రోజూ దేవతల్ని, యక్షుల్ని, కిన్నరుల్ని, కింపురుషుల్ని, నరుల్ని, ఖేచరుల్ని, సిద్ధుల్ని, గంధర్వుల్ని ఎందర్ని చూడ్డం లేదూ? ఒక్కరు.... ఒక్కరైనా ఇతనిలా ఉన్నారా? నిజం చెప్పద్దూ?..... ఆ వేద జడుడ్ని చూసి కొంచెం వేళమాడాలనిపించింది

ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర! ఏ
కాంతము నందు నున్న జవరాంద్ర నెపంబిడి పల్కరించు లా
గింతియ కాక - నీ వెరుగవే మునువచ్చిన త్రోవ చొప్పు....

ఆః ఏమయ్యా భూసురేంద్రా! అంతలేసి కన్నులున్నయ్యే వింత వింతగా మాటాడ్తావేం? ఒంటరిగా చిక్కానని, అందగత్తెనని, ఏదో ఓ సాకుతో పలకరించాలనీ కాకపోతే నిజంగా యిక్కడికెలా వచ్చావో నీకు తెలీదూ! ఎంత లోకువయ్యాను. అయితే ఏం లే! అందగాడివి వయసు కాడివి. జవాబు చెప్తాచ్చు... ఫరవాలేదు ఓ గోత్రామరేంద్రా!

"పేరు వరూధిని విప్రకుమార"..... ఊః ఊః ఊః విప్రకుమార! రూపాకార! ....... నన్ను వరూధిని అంటార్లే! ఘృతాచి, తిలోత్తమ, హరిణి, హేమ, రంభ, శశిరేఖ.... వీళ్లంతా నా ప్రాణసఖులు సుమీ! నేను వియచ్చరను! స్వర్గంలో కల్ప వృక్షఛాయలో మా ఆటా పాటా! మమ్ము చేరాలంటే రాజసూయాది యాగాలు చెయ్యాలి. అదీ సంగతి! పోనీలే! ఎండన పడి వచ్చావు. మా అతిధివి నువ్వు. మా యింటికి రావయ్యా స్వామీ! కుందనము వంటి మేను మధ్యందినా తపోష్మహతి కందె, వడ దాకె ఒప్పులొలుకు వదనము, అస్మద్గృహంబు పావనము సేసి బడలిక వాసి...... రా! నాతో... నా విందు ఆరగించు. నన్నూ నా యింటినీ పావనం చెయ్' అన్నాను నర్మగర్భంగా.

అంటే - ఆ వెర్రాయన - 'అమ్మా! (అమ్మాయీ అనైనా అనలేదు ప్చ్!) నీ మహిమలు చాలా గొప్పవి. నేనొస్తే ఒకటీ - రాకపోతే ఒకటేనా? నేను తొందర తొందరగా యిల్లు చేరాలి. మా అమ్మ, నాన్నా, మా సోమిదమ్మా నా కోసం ఎదురు చూస్తూ ఆత్రంతో తత్తరపడ్తూ వుంటారు' అన్నాడు.

'మరి - నా తత్తర పాటు చూడవా?' అన్నాన్నేను

'నేను వెళ్లి మాధ్యాహ్నికాదులు తీర్చాలి... తొందరగా చెప్పు. మా వూరుకి దారి ఎటో....!

నా ఊరుసంగతి చూడూ అంటే తన వూరికి దారేదీ అంటాడేం అనుకున్నాను. అయినా దారి తప్పిన వారికీ తప్పిజారి వచ్చిన వారికీ వాళ్లూరికి వెళ్లేందుకు దారి చెప్పే ఉద్యోగమూ నాది. అందుకోసమే యిక్కడిల్లు కట్టుకుని ఆ దివి నుంచి ఈ భువికి దిగి వచ్చానా అనుకుని అన్నాను.

ఎక్కడి యూరు? కాల్నిలువకింటికి పోయెద నంచు పల్కెదీ
వక్కట! మీ కుటీర నిలయంబులకున్ సరిరాక పోయెనే!
ఇక్కడి రత్న కందరము లిక్కడి నందన చందనోత్కరం
బిక్కడి గాంగసైకతము లిక్కడి యి లవలీనికుంజముల్

ఏం వూరయ్యా బాపడా! వూరు వూరని వూరకే తత్తరిస్తున్నావు. మీ వూరి గుడిసెకు మా రత్నాలమేడ యీడుకాదా? ఇక్కడి యీ పిల్లగాలులు, యీ చందన శీతలాలు, యీ గంగాతరంగ రమణీయ కలాపాలు నీకు నచ్చలేదా?"

'...............'

'అయ్యా' యింకా దాపరికం ఎందుకు?

నిక్కము దాప నేల ధరణీసురనందన! ఇంక నీ పయిన్
జిక్కె మనంబు నాకు, నను చిత్తజు బారికి అప్పగించెదో
చొక్కి మరందమద్యముల చూరలబాటలు పాడు తేంట్ల సాం
పెక్కినయట్టి పూవు పొదరిండ్లను కౌగిట గారవించెదో!

ఔను. ఇంకా దాపరికం ఎందుకు? నువ్వంటే నాకెంతో యిష్టం పుట్టింది. నన్ను మనసారా కౌగిలించి మదనోత్సవాల వుర్రూతలూగుతావో... లేక నన్ను మన్మధవేదనకి గురిచేస్తావో...."

"ఆగాగు... యిలా మాటాడొచ్చా? మా వంటి నిష్ఠాగరిష్ఠుల... విప్రుల.. వేదవిదులను యిలా కామించొచ్చా? అమ్మా భోజనం వేళయింది. మా వాళ్లు తత్తరిస్తూ వుంటారు...'

'ఈ ఎలప్రాయం జపతపాల్లో వ్యర్థం కావడమేనా? సుఖించేందుకు కాదా?' చచ్చాక దొరుకుతుందని ఆశించే సుఖం జీవించి వుండగానే ఎదురునిల్చి దోయిలొగ్గి మనసొగ్గి బిగ్గ కౌగిలిమ్మంటే వద్దనేందుకెగ్గుగా లేదూ?'

'.................'

'ఏమిటా మౌనం. గుడ్డివాడికి వెన్నెల్లాగా నీకు నా యవ్వన జ్యోత్స్న కనిపించడం లేదు. హుఁ.. ఎన్ని భవంబులన్ కలుగు? ఇక్షుశరాసన సాయక వ్యధా ఖిన్నత....'

'ఆగాగు. అదంతా నిజమే.. అది కాముకులకు.. అబలా! మాకు కాదు..' విను వరూధినీ

బ్రాహ్మణు డింద్రియ వశగతి
జిహ్మ చరణైక నిపుణ చిత్తజ నిశితా
జిహ్మగముల పాలై చెడు
బ్రహ్మానందాది రాజ్యపదవీ చ్యుతుడై.....' అన్నాడు.

'బ్రహ్మానందం... విప్రవరా! ప్రవరా! ఆనందో బ్రహ్మ.... అనే ఉపనిషత్ వాక్యం వినలేదా.. అది ఆలోచించవేం? 'పిచ్చివాడా!

'ఏం పాండిత్యం! ఏం పాండిత్యం! కామశాస్త్రం చదివిన పండితురాలిలా ఉన్నావ్... అవునా?.......

ఈ పాండిత్యము నీకు తక్క మరి ఎందే కంటిమే కామశా
స్త్రోపాధ్యాయివి నా వచించెదవు మేలహా! త్రయీ ధర్మముల్
ఎ గంబుల్ రతి పుణ్యమంచు ఇక ఏలా తర్కముల్. మోక్షల
క్ష్మీపథ్యాగము సూత్ర పంక్తికివెపో మీ సంప్రదాయార్థముల్....

ఔనౌను. మీ సంప్రదాయంలో వేదధర్మాలు పాపం. కామం పుణ్యమా? ఎందుకీ వృధా తర్కం? మీసాంతమీద శేనెలాటి యీ తుచ్ఛ సౌఖ్యాల మాట మాకెందుకు.."

ఏమేమి అన్నాడో తర్వాత వినబల్లేదు. కానీ..

నా గుండె గుభిల్లు మంది. రాయయినా మేలు నారాయణా అనుకున్నాను. కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి జరుగుతున్నదానికి. ఏం విధి! వైపరీత్యం కాదా యిది... ఏమయిపోయింది ఇప్పుడు. వనిత తనంత తా వలచి వచ్చిన చుల్కన కాదె ఏరికిన్... అనుకున్నాను. ఏమైతేనేం! ఇతన్నెలాగయినా నా కౌగిటి బందీని చెయ్యాలి. చూద్దాం. మీదపడి కౌగిలిస్తే...

అదే నిర్ణయానికి వచ్చాను.

'వెతలం బెట్టకు మింక నన్ను....' అని సమీపించా ఎలా? నీవీబంధమూడన్ రయోద్ధతి నూర్పుల్ నిగుడన్ వడిన్ విరుల్ చిందన్ కొప్పు వీడన్ తనూలత తోడ్తో పులకింపగా అనులయాలాపాతిదీనాస్యనై.... రతి సంరంభము మీరగా...

ప్రాంచత్ భూషణ బాహుమూల రుచితో పాలిండ్ల పొంగార్పై
అంచల్ మోవగ కౌగిలించి" అధరం... ఆశించబోయాను

'హా. శ్రీ హరీ....'

ఎంత తోపు తోశాడు బ్రాహ్మడు. ఎంత నిర్దయ. శరీరం మెత్తనే కానీ మనస్సు మెత్తన లేదే... ఎంత వాడిగా ఉన్నాయి గోళ్లు.. ఎలాగో ఎక్కడో కావలసిన నఖక్షతాలు యిలాగోటి గిచ్చులవుతాయా?... హుఁ ఏం మనిషి?

పొలుసకింతులోర్తురె కృపారహితాత్మక! నీవు త్రోవ ని
చ్చోట భవన్నఖాంకురము సోకె కనుంగొనుమంచు చూపి అ
ప్పాటలగంధి వేదన నెపంబిడి ఏడ్చె కలస్వనంబుతో
మీటిన విచ్చు గుబ్బచనుమిట్టల నశ్రులు చిందువందగన్.

చూడవయ్యా చూడు...
ఎంత గాయమైందో!
యజ్ఞాలన్నావ్! యాగాలున్నావ్!
తపం, జపం అన్నావ్!

దయలేకుండా ఏం చేస్తే ఎన్ని చేస్తే ఏం లాభం?"

వల వల ఏడ్చి ఆపై ఎవరెవరు ఎలా ఎలా మా కౌగిళ్లే లోగిళ్లుగా సుఖించిందీ చెప్పా. అయినా వినడే!

నా కర్మకు నన్నొదిలేసి, ఆ ఝరీ ప్రవాహం వద్దకు వెళ్లి ఒళ్లంతా కడుక్కుని నన్ను కావగదవే స్వాహాపదధూవల్లభా అంటూ

దానజపాగ్ని హోమపరతంత్రుడనేని - భవత్పదాంబుజ
ధ్యాన రతుండనేని పరదార ధనాదుల కోరనేని స
న్మానముతోడ నన్ను సదనంబున నిల్పు మినుండు పశ్చిమాం
భోనిధిలోన క్రుంకకయమున్న రయంబున హవ్యవాహనా!

అని ప్రార్థించాడు.

మింటికెగిసి.... నన్ను వలపు మంటల్లో తోసి వెళ్లిపోయాడు.

ఆ బాధతో చద్దామనిపించింది.

కానీ మేం దేవతలం. అమరులం. మాకా అదృష్టం ఎక్కడిది? చావలేక బతుకుతూ బతుకు సాగదీయాల్సిందే...

అయినా ఎక్కడికి వెళతాడు లే...

అటూ ఇటూ తిరిగి రేపో మాపో రాడూ?
అప్పుడు చెప్తా........
ఓ ఆట ఆడిస్తా.....
వరూధుని అంటే ఏంటో చెప్తా...... చూపిస్తా......

* * *